# పోలిక

ఆఫీసు గడియారం అయిదు గంటలు చూపిస్తోంది.

ఓసారి తలెత్తి చూసి అలిసిపోయినట్టు ఉస్సురుమని గట్టిగా నిట్టూర్చాడు రమణ. తరువాత మరిక ఒక్క నిముషం కూడా అదనంగా పనిచేయడం నష్టదాయకం అన్నట్టు గబగబా ఫైల్సన్నీ సర్దేసి లేచాడు బాగ్ పట్టుకుని.

వెళ్ళిపోబోతూ ఏదో గుర్తొచ్చింది. రికార్డ్ రూమ్ వైపు చూశాడు. నాగేశ్వర్రావున్నాడు.

"ఒరేయ్ నాగూ... నేన్చెప్పిందేంచేశావ్?" దర్జాగా అడిగాడు తన సీటు దగ్గర్నుంచే. రికార్డ్ కీపర్ సీటు దగ్గర కెళ్తే, నాగేశ్వర్రా వెంత ఫ్రెండయితే మట్టుకు, నామోషీ కాదూ?

"సిద్ధం గురూ!" అంటూకిందినుంచి తీశాడు నాగేశ్వర్రావు. "పట్టుకెళ్ళి పోతావా?" అనడిగాడు.

"ఆఁ" అన్నాడు రమణ.

నాగేశ్వర్రావు తన సీటు నుంచి కదిలివచ్చి ఇచ్చేశాడు. అతనిచ్చిన తెల్లకాగితాలూ, పెన్సిళ్ళూ, బాల్‌పెన్నులూ తన బాగ్‌లో సర్దుకున్నాడు. "నేనింటికి వెళ్ళిపోతా" అంటూ బయలుదేరాడు రమణ.

"సరే గురూ... రేపు కలుద్దాంలే" అటూ తన సీటుకేసి కదిలాడు నాగేశ్వర్రావు.

ఇల్లు చేరిన రమణ గుండె గతుక్కుమంది. సెగలూ పొగలూ కక్కుతోంది ఇల్లాలు. అందుకే ఇంటికన్నా గుడి పదిలం అనిపిస్తుంటుంది. తప్పనిసరి కాబట్టి రాత్రిపూట ఇంటికొస్తాడు రమణ.

"నీకివాళ అసలు అన్నం పెట్టను" అని కేకలేస్తోంది కమల.

బుంగమూతి పెట్టుకుని ఓ మూల కూర్చున్నాడు ఆరో తరగతి చదువుతున్న బుజ్జిగాడు. మధ్య మధ్యలో ఎందుకైనా మంచిదని వెక్కిళ్ళు పెడుతున్నాడు. చూస్తుంటే ముద్దొస్తాడు. అన్నీ తన పోలికలే.

"ఏనాడూ మాట విన్న పాపాన పోలేదు." పని మధ్యలో గుర్తొచ్చి ఒక్కో మాట విసుర్తోంది కమల.

ఇస్సురంటూ కుర్చీలో కూలబడ్డాడు రమణ.

"అసలిదంతా నాన్న ఇచ్చిన అలుసే. లేకపోతే కళ్ళు నెత్తిమీది కొస్తాయి... ఇలాంటి పని చేస్తాడా?" అంటూ కోరగా రమణకేసి ఒకసారి, కోపంగా బుజ్జిగాడికేసి ఒకసారి చూసింది కమల.

"ఏమిటి కమలా.. ఏం చేశాడు?" వస్తున్న విసుగును చూపిస్తే పెళ్ళిలో తను కట్నం పుచ్చుకున్నందుకూ, ఆఫీసులో లంచాలు పుచ్చుకుంటున్నందుకూ... చివరికి వంకాయలు పుచ్చువి కొంటున్నందుక్కూడా వరసపెట్టి సాధిస్తుంది.

"మీ బుజ్జిగాడు చేసిన నిర్వాకం వాడినే అడగండి."

"ఒరే బుజ్జీ, ఏవిట్రా నాన్నా?" అంటూ బుజ్జిగాణ్ణి తన పక్కకు రమ్మన్నట్టు సంజ్ఞ చేశాడు. కాని వాడా మూలనుంచి కదిలి రాలేదు.

"ఎలా వస్తాడు? చేసింది వెధవపని!"

"అబ్బ ఏమిటి కమలా? ఏవిటంత కానిపని చేశాడు?"

"అబ్బే... మీకు దొంగతనంకూడా కానిపని కాదు."

"దొంగతనం చేశాడా? ఏరా బుజ్జీ?" నమ్మలేనట్లుగా చూశాడు.

"కాదు. దొరతనం. పోలికలూ మీవే. ఇలా తయారవ్వడం మీ మూలానే."

"బాగుంది. మధ్యలో నేనేం చేశాను? పొద్దున్నే వెళ్ళిన వాణ్ణి పొద్దుపోతే గాని ఇల్లు చేరనే. వాడికి నీ ట్రైనింగే ఎక్కువ."

"అసలేం చేశావురా బుజ్జీ?" అనడిగాడు విసుగ్గా.

"మరేం..." అంటూ గారంగా రాగం తీస్తూ చెప్పబోయాడు.

"అబ్బ నంగనాచి! నాదేం తప్పు లేదంటూ మొదలెడతాడండీ. నాన్న దగ్గర ముద్దుకదా!"

"వాణ్ణి చెప్పనైనా చెప్పనియ్యి, లేదూ నువ్వయినా చెప్పు" అన్నాడు గట్టిగా, విసుగ్గా.

"ఏవుందీ, నాలుగు రోజులనుంచి వాడూ చెప్తున్నాడు. నేనూ చెప్తున్నాను. జామెట్రీ చేయడానికి మంచి పెన్సిలు లేదని. వీధి దుకాణంలో కొన్న పెన్సిలు మాటి మాటికీ విరిగిపోతున్నదని, మెత్తగా రాయడం లేదని వాడు గోల. మీరు బజార్లోంచే వస్తారు గాని, ఇంటి అవసరాలు మీకు పట్టవు."

"ఓస్... పెన్సిల్ గురించా?" అంటూ చప్పరించబోయాడు.

"పెన్సిలు గురించా..." వెటకారంగా సాగదీసి, "కాదు, ఆపెన్సిలు మీరు తేకపోవడంవల్లనే వచ్చింది ఇదంతాను. పక్క కుర్రాడి నడిగి క్లాసులో జామెట్రీ చేశాడు..."

"భేషుగ్గా వుంది. అడగడంలో తప్పేముంది?"

" ఆ పెన్సిలు చక్కగా మెత్తగా రాసిందట."

"బజార్లో కొన్నది కాబోలు."

"ఆ, మీరు కొనలేదుగా? అందుకే వాడు పక్కవాడి పెన్సిలుతో పని చేసినంతసేపూ చేసి చక్కా తన బేగులో పడేసుకొచ్చాడు." ఆగలేదుకమల. "రేపు తెల్లారి ఆ కుర్రాడు మేస్టారుకి చెప్పి నానా యాగీ చేస్తే... పిల్లలందరిలో వాడి కెంత అవమానం! ఆ పిల్లలు తిరిగి వాళ్ల వాళ్ళ ఇళ్ళల్లో చెప్తే మనకెంత తలవంపులు"

ఆఫీసు నుండి తను పెన్సిళ్ళూ, పెన్నులూ తేవడం గుర్తొచ్చింది రమణకి.

“ నీ కోసంఏం తెచ్చానో చూశావురా బుజ్జీ?” హుషారుగా బేగ్ తీశాడు.

బుజ్జిగాడు కూడా నోరు విప్పాడు - “ఆఫీసులోవినువ్వు బేగ్‌లో వేసుకురావట్లే. నేనూ పెన్సిలు బాగుందని బేగ్‌లో వేసుకున్నా నాన్నా, అంతే, దొంగతనం చెయ్యలే!”

అవాక్కయిపోయాడు రమణ.

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 12-9-1989)